క్లుప్తంగా

రామాలయ పునఃనిర్మాణ పనుల పరిశీలన



జగ్గయ్యపేట: రామాలయ పునఃనిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టాలని దేవదాయశాఖ డెప్యూటీ ఎక్స్‌క్యూటివ్ ఇంజినీర్ డి.గోపాలకృష్ణ రాజు పేర్కొన్నారు. పట్టణంలోని సీతారామ ఆలయం (పెద్ద రామాలయం) పునఃనిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ. 1.30 కోట్లతో ఆలయ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటి వరకు 90 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. మిగిలిన పనుల్లో ఆలయం చుట్టూ ఫ్లోరింగ్ చేయాల్సి ఉందని చెప్పారు. అనంతరం కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈ డీఎస్ కుమార్, ఈఓ సీహెచ్ హరిదుర్గా నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్‌కు శంకుస్థాపన



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని 14వ వార్డు విలియంపేటలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా ఉండేందుకు రూ. 4 లక్షల నిధులతో పైపులైన్ ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. విలియంపేటలోని బాబురావు విగ్రహం వీధిలో 15వ ఆర్థిక సంఘం నిధులతో ఏర్పాటు చేయనున్న పైపులైన్‌కు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్ నకిరికంటి వెంకట్, కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, సంగెపు బుజ్జిబాబు, గొట్టె నాగరాజు, పేరం సైదేశ్వరరావు, నరసింహారావు, మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ త్రినాథ్, డీఈఈ, ఏఈలు పాల్గొన్నారు.

పోరుబాటను విజయవంతం చేయండి

జగ్గయ్యపేట: విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించే పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఉదయం తొమ్మిది గంటలకు పార్టీ కార్యాలయం నుంచి డిపో సెంటర్‌లో ఉన్న విద్యుత్‌శాఖ ఏడీ కార్యాలయం వరకు పాదయాత్రగా వెళ్లి నిరసన కార్యక్రమం చేపడతామన్నారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

సమ్మె కాలపు హామీలను అమలు చేయాలి



నందిగామ టౌన్: గత సమ్మె కాలపు హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీఐటీయూ నాయకుడు కటారపు గోపాల్ డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులతో కలిసి గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలన్నారు. 200ల యూనిట్ల లోపు విద్యుత్ ఎస్సీ, ఎస్టీలకు ఉచితమని చెబుతున్నా కార్మికులు మాత్రం చెల్లించాల్సి వస్తోందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పథకాలు అందించడంతో పాటు సమ్మె కాలపు హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పూట మాణిక్యం, గరికపాటి ప్రసాద్, రూతమ్మ, పిచ్చయ్య, సతీష్, భూషి, బేబి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సారా తయారీదారుల అరెస్ట్

తిరువూరు: తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గురువారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి సారా తయారీదారులను అరెస్టు చేశారు. విస్సన్నపేట మండలం చంద్రుపట్ల తండాలో సారా తయారుచేస్తున్న మహిళ బాణావతు పింప్లి, ఆమె భర్త బజారిని అరెస్టు చేసి లీటరు సారా, 40 లీటర్ల బెల్లపు ఊట స్వాధీనం చేసుకున్నారు. ఎ.కొండూరు మండలం గొల్లమందల తండాలో సారా తయారీకి సిద్ధం చేసిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. గంపలగూడెం మండలం అమ్మిరెడ్డిగూడెంలో గుండ్ల కిశోర్ నుంచి 2 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని నిందితుడ్ని అరెస్టు చేశామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. సారా తయారు చేసే వారిపై పీడీ చట్టం కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

విద్యుత్ బిల్లుల మోత

- యూనిట్‌కు రూ. 1.22 నుంచి రూ.2.50 పైసలు పెంచే అవకాశం
- నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిరసన



నిరసనకు సంబంధించి పోరుబాట పోస్టర్ ఆవిష్కరిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు తదితరులు (ఫైల్)

జగ్గయ్యపేట: సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తన మార్క్ నయవంచనతో తానిచ్చిన హామీలకు తూట్లు పొడుస్తూ మరోసారి ప్రజల నడ్డి విరిచారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని ట్రూ అప్ చార్జీలు కూడా ఎత్తేస్తామని నాడు ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కూటమి ప్రభుత్వం రెండుసార్లు విద్యుత్ చార్జీలు పెంచింది. ఇంధన సర్దుబాటు చార్జీల పేరిట గత నెలలోనే వినియోగదారులపై భారాన్ని మోపిన ప్రభుత్వం ఇప్పుడు ఈ నెల నుంచి మరో బాదుడుకు సిద్ధమైంది. 2026 వరకు ఈ బాదుడును వినియోగదారులు భరించేలా తీర్మానించి కొత్త చార్జీలను అమలు చేస్తున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా నిరసన

విద్యుత్ నియంత్రణ మండలి నుంచి ఆమోదం లభించడంతో ప్రజలపై కొత్త భారం పడనుంది. దీంతో నియోజకవర్గంలోని 87,892 కనెక్షన్ల వినియోగదారులపై భారం పడనుంది. పెనుగంచిప్రోలు మండలంలో 17,392 కనెక్షన్లు, వత్సవాయి మండలంలో 17,500లు, జగ్గయ్యపేట మండలంలో 20 వేలు, మున్సిపాలిటీ పరిధిలోని 25 వేల కనెక్షన్లు ఉన్నాయి. ఈ భారాన్ని తగ్గించాలనే ఉద్దేశ్యంతో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనకు పిలుపునిచ్చింది. దీంతో పట్టణంలోని కోదాడ రోడ్డులో గల విద్యుత్‌శాఖ ఏడీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఐదు నెలల్లో రెండుసార్లు

ఇంధన సర్దుబాటు చార్జీల పేరిట ఇటీవలే డిస్కంల ప్రతిపాదనలను నియంత్రణ మండలి ఆమోదించడంతో దాదాపుగా ఎల్‌టీ వినియోగదారుని విద్యుత్ వినియోగం యూనిట్‌కు గరిష్టంగా రూ. 1.22 పైసలు నుంచి రూ. 2.50 పైసల వరకు పెరిగింది. రెండు నెలల క్రితం యూనిట్ వినియోగ చార్జీలు రూ. 1.55 వరకు పెంచేసిన సర్కార్ ఇప్పుడు రెండోసారి మరో రూ. 0.92 వరకు పెంచేస్తూ నిర్ణయించింది. దీంతో వరుసగా రెండు సార్లు చార్జీల పెంపు అమలు చేయడంతో విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మొదటి పెంపుతో నవంబరు నుంచి 2026 జనవరి వరకు.. అలాగే రెండో దఫా పెంపుతో ఈ నెల నుంచి 2028 నవంబరు వరకు అదనపు చార్జీల భారం పడనుంది.

ప్రజలకు అండగా వైఎస్సార్ సీపీ

ఇంధన సర్దుబాటు చార్జీల పెంపు అంశంపై ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిరసన చేపడుతున్నాం. జిల్లా వ్యాప్తంగా నిరసనలకు సంబంధించి పోస్టర్లను విడుదల చేశాం. నియోజకవర్గ కేంద్రంలో ర్యాలీ చేసి విద్యుత్ శాఖాధికారులకు వినతులు అందిస్తాం. ప్రజల తరఫున పోరాటాలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుంది.

– తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త

ఘనంగా సీపీఐ శత వార్షికోత్సవం



జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

పెనుగంచిప్రోలు: పేద ప్రజల సంక్షేమం కోసం జరిగిన పోరాటాల్లో కమ్యూనిస్టుల పాత్ర కీలకమైనదని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు వల్లంకొండ బ్రహ్మం అన్నారు. సీపీఐ పార్టీ 100వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీపీఐ మొదటి నుంచి ప్రజలు, కార్మికులు, రైతులు, బడుగు బలహీన వర్గాల కోసం నిలబడటమే కాకుండా వారి కోసం నిరంతరం పోరాడుతూనే ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పొన్నం నరసింహారావు, కనకపూడి బాబూరావు, గడ్డం శ్రీనివాసరావు, జక్కులూరి వెంకటేశ్వర్లు, కొలకాని వీరయ్య, వేల్పుల కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: సీపీఐ 100వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు గురువారం నిర్వహించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి అంబోజీ శివాజీ సీపీఐ పతాకాన్ని ఆవిష్కరించారు. పార్టీ పట్టణ కార్యదర్శి జె. శ్రీనివాసరావు, నాయకులు భోగ్యం నాగులు, నీలకంతం శివప్రసాద్, మాశెట్టి రమేష్, షేక్ జానీ, భాను పాల్గొన్నారు. అలాగే ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో జగ్గయ్యపేట ఎమ్మెల్యేగా 20 ఏళ్ల పనిచేసిన కామ్రేడ్ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు 25వ వర్ధంతిని సీపీఐ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.



పేటలో సీపీఐ జెండాను ఆవిష్కరించిన సీపీఐ నాయకులు

నేడు గుమ్మడిదుర్రులో రెవెన్యూ సదస్సు

గుమ్మడిదుర్రు(పెనుగంచిప్రోలు): గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎ. శాంతిలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలను సదస్సు ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భూ వివాదాల పరిష్కారానికి చర్యలు



పోచంపల్లిలో అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ మనోహర్

చెవిటికల్లు(కంచికచర్ల): రైతుల భూముల్లో భూ వివాదాలకు తావులేకుండా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ పి. జాహ్నవి పేర్కొన్నారు. మండలంలోని చెవిటికల్లు గ్రామ సచివాలయంలో గురువారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పి. జాహ్నవి మాట్లాడుతూ భూముల సర్వే నెంబర్లలో సమస్యలు, కొలతలు, సరిహద్దుల్లో తేడాలు ఉన్నట్లయితే రైతులు అర్జీలు దాఖలు చేసుకోవాలని సూచించారు. వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. ఈ సదస్సులో పట్టాదారు పాసుపుస్తకాలు, కొలతలు, హద్దులు తేడాలున్నాయని రైతుల నుంచి మూడు అర్జీలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ మానస, ఆర్ఐ వెంకట్, వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

తాళ్లూరులో 32 అర్జీలు

తాళ్లూరు(వత్సవాయి): గ్రామ సచివాలయ ఆవరణలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి పలు సమస్యలపై 32 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ ఎస్. నరసింహారావు తెలిపారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ రైతులు తమ భూసమస్యలపై గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను ఉపయోగించుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని చెప్పారు. సదస్సుల్లో నేరుగా రైతులు అర్జీలు అందించవచ్చునన్నారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బొల్లా వెంకటేశ్వరరావు, ఆర్ఐ జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

సమాచారం లేకుండానే సదస్సు

నందిగామ టౌన్: మండలంలోని మునగచర్ల గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ సురేష్‌బాబు మాట్లాడుతూ పట్టాదారు పాస్‌పుస్తకం, సర్వే నెంబర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అర్జీలు వచ్చాయన్నారు. కాగా ఎటువంటి సమాచారం లేకుండా సదస్సు నిర్వహించడంతో రైతులు పాల్గొనలేదు. దీనిపై గ్రామానికి చెందిన న్యాయవాది చిరుమామిళ్ల కిరణ్ తహసీల్దార్‌ను ప్రశ్నించగా రెవెన్యూ సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

పోచంపల్లి(జగ్గయ్యపేట): గ్రామంలో సచివాలయం వద్ద గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ పి.మనోహర్ రైతుల నుంచి పలు సమస్యలపై అర్జీలు స్వీకరించారు. సర్పంచ్ బూతుకూరి లక్ష్మీనాగిరెడ్డి, మాజీ సర్పంచ్ ముల్లంగి రామకృష్ణరెడ్డి, వీఆర్వో హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



చెవిటికల్లు రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి అర్జీలు తీసుకుంటున్న తహసీల్దార్ జాహ్నవి



తాళ్లూరు సదస్సులో రైతు అందించిన అర్జీ పరిశీలిస్తున్న తహసీల్దార్

పేదల అభ్యున్నతికి వీఎం రంగా కృషి



రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు తదితరులు



చిల్లకల్లులో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న అభిమానులు



పేటలో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న తన్నీరు, వైఎస్సార్ సీపీ నేతలు

నందిగామ మాజీఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: వంగవీటి మోహనరంగా పేదల పక్షపాతి అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గాంధీ సెంటర్, అనాసాగరంలోని రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి వీఎం రంగా విశేషంగా కృషిచేశారని కొనియాడారు. రంగా పేదల పక్షాన నిలిచి ప్రత్యర్థుల చేతిలో హతమయ్యారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు మహ్మద్ మస్తాన్, పాములపాటి రమేష్, కన్నెకంట జీవరత్నం, కర్రి రవీంద్ర, నెలకుదిటి శివనాగేశ్వరరావు, పారుపల్లి హరిబాబు, ఓర్సు జ్వాలా, వేమా సురేష్‌బాబు, మందా మరియమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేసిన నేత వంగవీటి మోహన్‌రంగా అని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. రంగా 36వ వర్ధంతిని వైఎస్సార్ సీపీ పట్టణ విభాగం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కోదాడ రోడ్‌లో ఉన్న రంగా విగ్రహానికి పార్టీ పట్టణ అధ్యక్షుడు, శ్రీకృష్ణదేవరాయ సేవా సమితి(కాపు సంఘం) ఉపాధ్యక్షుడు వట్టెం మనోహర్, పార్టీ నేతలతో కలిసి నివాళులర్పించారు. అనంతరం తన్నీరు మాట్లాడుతూ రంగాను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు చౌడవరపు జగదీష్, మండల అధ్యక్షుడు బూడిద నరసింహారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ హఫీజున్నీసా ఫిరోజ్, పార్టీ రాష్ట్ర ఎస్టీ, ఎస్సీ సెల్ నాయకులు బద్దూనాయక్, కన్నమాల శామ్యూల్, జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి షేక్ జుబేర్, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా వైకుంఠరావు, జిల్లా కార్యదర్శులు మాతంగి నాగబాబు, వేముల మల్లేశ్వరరావు, న్యాయవాది సత్యశ్రీనివాస్, బీసీ సెల్ నాయకులు, ఏఎంసీ మాజీ డైరెక్టర్లు మన్నె అప్పారావు, పింగళి నర్సింహారెడ్డి, కార్యకర్తలు, రంగా అభిమానులు పాల్గొన్నారు.

చిల్లకల్లు(జగ్గయ్యపేట): దివంగత మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా వర్ధంతి వేడుకలు గురువారం రంగా అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఎస్సీ కాలనీ వద్ద ఉన్న రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగా అభిమానులు కఠారి శ్రీను, సుంకర వేణు, మాతంగి నాగబాబు, మధు, శీలం కొండా, లలితారామ్, లాజర్ పాల్గొన్నారు.

వీరులపాడు: మండలంలోని పెద్దాపురం గ్రామంలో రంగా వర్ధంతి నిర్వహించారు. రంగా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, సర్పంచ్ నిప్పులపల్లి ప్రశాంతి, సొసైటీ అధ్యక్షుడు ఆవుల ప్రసాద్, మాజీ అధ్యక్షుడు కోటేరు సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు. అలాగే జుజ్జూరు, అల్లూరు, నరసింహారావుపాలెం, వెల్లంకి, జయంతి గ్రామాల్లో రంగా వర్ధంతిని నిర్వహించారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల: కంచికచర్ల నెహ్రూబొమ్మ సెంటర్‌లో గురువారం వంగవీటి మోహన్‌రంగా 36వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, రాధా రంగా మిత్ర మండలి సభ్యులు రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కాలవ పెదబాబు, సురేష్‌బాబు, రాధా రంగా మిత్ర మండలి నాయకులు ఉప్పు స్వామి, బచ్చు వెంకటేశ్వరరావు, దాసరి రాజా, చాపా సత్యనారాయణ, దేదిరెడ్డి విఘ్నేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కంచికచర్లలో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకుల

స్మార్ట్ మీటర్లతో షాక్

- మండలంలో 250 మీటర్లు అమర్చిన అధికారులు
- ముందస్తు చెల్లింపులపై వినియోగదారుల అసంతృప్తి



పెనుగంచిప్రోలులో కేటగిరి-2 దుకాణాలకు అమర్చిన స్మార్ట్ మీటర్లు

పెనుగంచిప్రోలు: స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్మార్ట్ మీటర్‌కు ముందే రీచార్జ్ చేయాల్సి ఉంటుంది. కేటగిరి–2 దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలతో పాటు గృహాలకు స్మార్ట్ మీటర్లు (ప్రీపెయిడ్ మీటర్లు) ఏర్పాటు చేయనున్నారు. మండలంలో దాదాపు 17,392 వివిధ రకాల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇప్పటి వరకు మండలంలో 250 స్మార్ట్ మీటర్లు అమర్చినట్లు విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే ఈ మీటర్లుకు సిమ్ కార్డులు ఇంకా అమర్చలేదు. దశల వారీగా వాటిని ప్రీపెయిడ్ మీటర్లుగా మార్చనున్నారు. కాగా ముందస్తు చెల్లింపులపై ప్రజల్లో ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం ఈ నెల వినియోగించిన కరెంట్ బిల్లులు మరుసటి నెల చెల్లిస్తున్నాం. బిల్లు పొందిన 15 రోజుల వరకు అపరాధ రుసుం ఉండదు. మరో 15 రోజుల్లో బిల్లు చెల్లించడానికి అవకాశం ఉంటుంది. ప్రీపెయిడ్ విద్యుత్ మీటర్లు అమర్చితే పరిస్థితి మారుతుంది. ముందుగానే నగదు చెల్లించుకుని రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో పేదలకు ఇబ్బందిగా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ప్రారంభమైన ప్రక్రియ

ముందుగా కేటగిరి–2, వ్యాపార సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారు. వీలైనంత త్వరలో అన్ని రకాల విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు అమర్చాలనే లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారు. అయితే ఈ స్మార్ట్ మీటర్ల ప్రక్రియను కొందరు వ్యతిరేకిస్తున్నారు. సెల్‌ఫోన్ లాగా ముందస్తుగా రీచార్జి చేయడంపై ముఖ్యంగా పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల్లో అలజడి మొదలైంది. రీచార్జి అయిన వెంటనే మరలా సిమ్ రీచార్జి చేసుకోవాలని వాపోతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు మాత్రం స్మార్ట్ మీటర్ల ద్వారా వినియోగదారులు నాణ్యమైన విద్యుత్ పొందవచ్చని అంటున్నారు.

ఉన్న మీటర్లే కొనసాగించాలి



ప్రభుత్వం స్పందించి ఉన్న మీటర్లనే కొనసాగించాలి. గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో రీచార్జ్ అయిపోతే కరెంట్ కట్ అవుతుంది. రీచార్జ్ అవకాశం లేక రాత్రంతా చీకటిలో ఉండాల్సి వస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పురనాలోచించాలి.

– దారా వెంకటేశ్వరరావు, పెనుగంచిప్రోలు

ఆందోళనలో ప్రజలు



స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కరెంట్ బిల్లుల పెంపుపై కంటి మీద కునుకు లేకుండాపోయింది. గ్రామీణ ప్రాంతాల్లో రీచార్జ్ అయిపోతే పరిస్థితి ఏంటని వాపోతున్నారు. అసలు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లపై ప్రజల్లో అవగాహన లేదు.

– కనకపూడి భాస్కరరావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు

వైఎస్సార్ సీపీ కంచికచర్ల మండల కన్వీనర్‌గా బండి



నందిగామ టౌన్: వైఎస్సార్ సీపీ కంచికచర్ల మండల కన్వీనర్‌గా బండి మల్లికార్జునరావును నియమించినట్లు ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కంచికచర్ల మండల నాయకులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లికార్జునరావును మండలంలోని అన్ని గ్రామాల నాయకుల మద్దతుతో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు నియమించినట్లు చెప్పారు. తనపై నమ్మకంతో మండల కన్వీనర్‌గా నియమించినందుకు బండి మల్లికార్జునరావు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బండిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మలక్ బషీర్, వైఎస్సార్ సీపీ నాయకులు వేమా సురేష్‌బాబు, కాలవ పెద్దబాబు, చింతా రవీంద్రనాథ్, బుడ్డి సత్యనారాయణ, గుదే అక్కారావు, శ్రీనివాసరెడ్డి, రామారావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.